సాక్షి
తిరుపతి
శనివారం ၊ 4 ၊ మే ၊ 2024



అభివృద్ధి నిరోధకులు
కూటమి నేతలు.. అభివృద్ధి నిరోధకులని, ఎన్నికల్లో వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే భూమన పిలుపునిచ్చారు. - 10లో



లారీ..మినీ లారీ ఢీ
లారీ..మినీ లారీ ఢీకొన్న ఘటన చిల్లకూరు మండలం, బూదనం టోల్‌ప్లాజా సమీపంలో చోటు చేసుకుంది. - 10లో



టీడీపీకి షాక్
శ్రీకాళహస్తిలో టీడీపీకి షాక్ తగిలింది. టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు చక్రాల ఉషా ఆ పార్టీకి రాజీనామా చేశారు. - 10లో

న్యూస్‌రీల్

నేడు పలమనేరుకు సీఎం వైఎస్ జగన్



పలమనేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం పలమనేరుకు రానున్నారు. ఉదయం 12.30 గంటలకు ఆయన గంగవరం సమీపంలోని యూనివర్సల్ మైదానానికి హెలికాప్టర్‌లో చేరుకుంటారు. అనంతరం బస్సులో పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. శుక్రవారం ఈ మేరకు హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

8న ప్రధాని రాక



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 8వ తేదీన జిల్లాకు విచ్చేయనున్నారు.ఈ మేరకు ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ శుక్రవారం పేర్కొన్నారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వర్చువల్ విధానంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అనంతరం తిరుపతి కలెక్టర్ వివరిస్తూ తిరుపతి విమానాశ్రయానికి భారత ప్రధాని మే8న మధ్యాహ్నం చేరుకుని రాజంపేటలో బహిరంగ సభకు హెలికాప్టర్‌లో బయల్దేరి వెళతారని తెలిపారు. తిరిగి సాయంత్రం తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని విజయవాడకు బయల్దేరి వెళ్లనున్న వెల్లడించారు. ఈ మేరకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని వివరించారు.

సామాజిక జ్ఞానం అవసరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి సిటీ: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియం వేదికగా జరిగిన ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. ఆర్ట్స్ సబ్జెక్టులలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉత్తమ సమాజ నిర్మాతలవుతారన్నారు. యువత క్రమశిక్షణతో పాటు తోటి వారి అభిప్రాయాలకు గౌరవమియ్యాలని కోరారు. స్నేహం నాలుగు కాలాలపాటు కొనసాగాలంటే అహంకారం ప్రదర్శించకూడదని హితువు పలికారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడలు, సాంస్కృత అంశాలపై దృష్టి సారించాలని చెప్పారు. అనంతరం ప్రిన్సిపల్ పద్మనాభం మాట్లాడుతూ విద్యార్థులు నేర్పుతో విద్యాభ్యాసం చేయాలన్నారు. సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీన్ మురళీధర్, పాలకమండలి సభ్యులు సుమకిరణ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం:స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 3వ తరగతిలో 40 సీట్లకుగాను ఎస్టీలకు 32, ఎస్సీలు 5, బీసీలకు 2, ఓసీలకు ఒక సీటు కేటాయించినట్లు వెల్లడించారు. 4 నుంచి 9వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీల ను ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేయనునట్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9989468202 లో సంప్రదించాలని కోరారు.



ఈమె పేరు మంగళపూరి శాంతమ్మ. ఊటుకూరు గ్రామం, సైదాపురం మండలం. భర్త వెంకటయ్య కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్నంతలో ఒక్కగానొక్క కుమార్తెకు పెళ్లిచేసి మెట్టింటికి పంపింది. శాంతమ్మ ఇటీవలే ప్రమాద వశాత్తు కింద పడడంతో కాలు విరిగింది. అప్పటి నుంచి నడవలేని పరిస్థితి. బయటకు రావాలంటే వీల్‌చైరే గతి. వృద్ధాప్య పింఛన్ ప్రతి నెలా వలంటీర్ ద్వారా ఇంటికే వస్తుండడంతో జీవితం సాఫీగా సాగింది. కానీ రెండు నెలలుగా ఇంటికి పింఛన్ రాకపోవడంతో ఆమె పరిస్థితి అయోమయంలో పడింది. గత నెల అవస్థలు పడి ఊటుకూరు సచివాలయానికి వెళ్లి పింఛన్ సొమ్మును తీసుకుంది. ఈ నెలకు పింఛన్ సొమ్ము ఊటుకూరులోని కెనరా బ్యాంక్ ఖాతాలో జమకావడంతో ఆటోలో బ్యాంక్ వద్దకు వచ్చింది. ఆటోకు రానుపోనూ రెండు వందలు ఇచ్చింది. పింఛన్ సొమ్ము తీసుకుని నానా అవస్థలు పడుతూ ఇంటికి చేరింది. మాకు ఇన్ని కష్టాలు పెట్టిన ఆ చంద్రబాబు మట్టికొట్టుకుపోతాడంటూ శాపనార్థాలు పెడుతోంది. మరోసారి సీఎంగా జగనే రావాలని దేవుడ్ని ప్రార్థిస్తోంది.



ఈ ఫోటోలో కలువాయి స్టేట్‌బ్యాంకు ముంగిట సొమ్మసిల్లి పడిపోయి ఉన్న వృద్ధుడి పేరు పెరుమాళ్ల లక్ష్మయ్య. కలువాయి మండలం, చింతలపాళెం గ్రామం. ఈయన ఆటో బాడుగ రూ.200 చెల్లించి తన మనవడితో కలిసి కలువాయిలోని బ్యాంకు వద్దకు శుక్రవారం వచ్చాడు. బ్యాంకు అకౌంట్లో పింఛను జమ కాలేదని చెప్పారు. ఎండకు ఆటోలో వచ్చిన ఆయన బ్యాంకు ముందే నీరసంతో సొమ్మసిల్లి పడిపోయారు. పింఛను అందుతుందో లేదో అన్న ఆందోళన మరింత బాధ పెడుతోందని వాపోతున్నాడు.



నాయుడుపేట మండలం, కాపులూరు గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలు శుక్రవారం పింఛన్ సొమ్ము కోసం 9 కి.మీ దూరంలోని నాయుడుపేట పట్టణానికి ఆటోలో వచ్చింది. ఆపై తన బ్యాంక్ ఖాతా ఉన్న ఎస్బీఐ వద్దకు వెళ్లి అక్కడే సొమ్మసిల్లిపడిపోయింది. దాదాపు గంట పాటు లేవలేక అక్కడే ఉండిపోయింది. సహాయకులు లేకపోవడంతో స్థానికులే నీళ్లు తాపించారు. తర్వాత తమ గ్రామస్తులు గుర్తించి ఇంటికి తీసుకెళ్లారు.

పింఛన్.. బాబు ముంచేన్!



పింఛన్ లబ్ధిదారులతో కిక్కిరిసిన వరదయ్యపాళెం స్టేట్‌బ్యాంక్

ఇదివరకు ఒకటో తేదీ వస్తే పండుగ వచ్చినట్టుండేదని అవ్వాతాతలు చెబుతున్నారు. వలంటీర్ ఇంటికి వచ్చి ఆత్మీయంగా పలకరిస్తే ఆనందంగా అనిపించేదని.. చేతికి పింఛన్ సొమ్ము అందగానే ప్రాణం లేచి వచ్చేదని వెల్లడిస్తున్నారు. కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఎవరిపై ఆధారపడాల్సిన పనిలేదు అనే ధైర్యం వచ్చేదని తెలియజేస్తున్నారు.. ఇలా సాఫీగా సాగిపోతున్న మా జీవితాలను చంద్రబాబు కష్టాల కడలిలోకి నెట్టేశారని ఆవేదన చెందుతున్నారు. పింఛన్ నగదు కోసం బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండే ఎండల్లో తిరగలేక ప్రాణం పోయేలా ఉందని వాపోతున్నారు. ఇంతగా తమపై కక్షగట్టడం ధర్మం కాదని.. తమ ఉసురు తప్పక తగులుతుందని శాపనార్థాలు పెడుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్



- పెన్షన్ డబ్బుల కోసం పండుటాకుల కష్టాలు
- బ్యాంకు చుట్టూ తప్పని ప్రదక్షిణలు
- ఆటోల్లో తిరగలేక నీరసిస్తున్న వృద్ధులు
- మండే ఎండల్లో అభాగ్యుల ముప్పతిప్పలు
- ఎంత పనిచేశావు చంద్రబాబూ అంటూ కన్నీరుపెడుతున్న అవ్వాతాతలు

బలైపోయాం బాబు



ఈ ఐదేళ్లు కష్టం తెలియకుండా వలంటీర్లు పింఛన్ ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. చంద్రబాబు రాజకీయ స్వలాభం కొరకు మేము బలైపోయాం. పోయిన నెలలో రెండు రోజులు అష్టకష్టాలుపడి సచివాలయానికి వెళ్లి పింఛన్ తెచ్చుకున్నాం. ఈ నెల బ్యాంకుల్లో వేశామని చెప్పారు. బ్యాంకుల వద్దకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిలబడినా పింఛన్ చేతికి రాలేదు. నాకు సంబంధం లేని ఎక్కడో ఉన్న బ్యాంకు అకౌంట్లో పింఛన్ డబ్బు జమ అయ్యిందని చెప్పారు. నేను ఈ మండుటెండల్లో ఎక్కడకు వెళ్లాలో తెలిక ఇంటికి వచ్చేశాను. - బండి వెంకటసుబ్బయ్య, గొల్లపాళెం

మేం అవస్థలు పడితే బాబుకు సంతోషం



టీడీపీ పాలనలో పింఛన్ల కోసం వారం రోజులపాటు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా అందేది కాదు. ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చాక వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీనే ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చేవారు. ఈ ప్రక్రియతో సంతోషంగా ఉన్నాం. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ పాత కష్టాలు గుర్తు చేశారు. మేము సంతోషంగా ఉండడం ఆయనకు ఇష్టం లేదేమో. మేము అవస్థలు పడుతుంటే చంద్రబాబు సంతోషంగా ఉంటాడు. ఈ పరిస్థితి నుంచి మాకు విముక్తి కల్పించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని దేవున్ని ప్రార్థిస్తున్నాను.
- గురకయ్య, పింఛన్ లబ్ధిదారుడు, వరదయ్యపాళెం

ఈ తిప్పలు మాకొద్దు బాబూ!



నేను నడవలేని పరిస్థితిలో ఉన్నాను. ఎలాగోల చిన్నగా కాళ్లీడ్చుకుంటూ రెండు రోజుల నుంచి బ్యాంక్ చుట్టూ తిరుగుతున్నాను. అయినా పింఛన్ రాలేదు. చివరిగా నా అకౌంటు సరిగాలేదని, అందుకు సంబంధిత ఆధారాలు తెచ్చి కొత్తగా అకౌంటు చేసుకోవాలని చెబుతున్నారు. మాకు ఇన్ని కష్టాలు తెచ్చిన చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది.
- ఇన్నమాల కోటయ్య, గొల్లపాళెం

చంద్రబాబు వల్లే ఈ బాధలు



నాకు పట్టణంలోని స్టేట్ బ్యాంకులో ఖాతా ఉంది. మా ఊరు నుంచి పది కిలోమీటర్ల దూరంలోని శ్రీకాళహస్తికి ఆటోలో వచ్చి వెంకటగిరి బస్టాండులో దిగాను. అక్కడి నుంచి మరో రూ.20 ఇచ్చి బ్యాంకు వద్దకు చేరుకున్నా. ఆటోలో వస్తుంటే ఎండకు దేవుళ్లు కనిపించారు. వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు ఎందుకు ఈ బాధలు?. గతంలో చంద్రబాబు పాలనలో గుడి వద్ద, బడుల వద్ద నిలబడుకుని పింఛన్ తీసుకునేవాళ్లం. ఇప్పుడు ఆయన వల్లే సచివాలయాలు, బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పింఛన్ ఇంటికి వచ్చి ఇచ్చే ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నా.
- చెంగమ్మ, కొణతనేరి, తొట్టంబేడు

ఎందుకిలా చేస్తున్నావు బాబు



గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి ఉంటే మధ్యాహ్నం.. లేకపోతే సాయంత్రం పంచాయతీ కార్యదర్శిలు వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చేవాళ్లు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అలాంటి స్థితి మారింది. ఇల్లు కదలకుండా ఈ ఐదేళ్లు పింఛన్ సొమ్ము తీసుకున్నాం. వలంటీర్లు వేకువజామునే వచ్చి పింఛన్ నగదు ఇచ్చివెళ్లేవారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడే సరికి చంద్రబాబు కుట్రపన్ని మమ్మల్ని ఈ విధంగా కష్టాలు పాలుచేశారు. సచివాలయం, బ్యాంకుల చుట్టూ తిప్పుతున్నారు.
- సుబ్బరత్నమ్మ (చిల్లకూరు)

మాకెందుకీ శిక్ష



ఆ క్యూలో నిల్చోలేక ఇలా బ్యాంకు వద్దనే కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. బ్యాంకు లోపలకి వెళ్లితే ఆ బ్యాంకులో దారిలేకుండా జనంతో కిక్కిరిసిపోయి ఉంది. ఏమి చేయలో తెలియక అవస్థలు పడ్డాను. ఇంతకీ ఎందుకీ కష్టాలు బాబు మాకు. ఇదివరకు నేను లక్షణంగా ఇంటి దగ్గరే పింఛన్ తీసుకునే దాన్ని. రెండు నెలలుగా పింఛన్ డబ్బులు కోసం పడరానిపాట్లు పడుతున్నాం. ఈ వయస్సులో మమ్మల్ని ఇబ్బంది పెట్టి ఏమిసాధిస్తారు. ఆ చంద్రబాబుకు మాపై ఎందుకింత కక్ష.
- పేరంబాక సంపూర్ణమ్మ, రాపూరు

చిల్లకూరు మండలంలో నాలుగు బ్యాంక్‌లు ఉన్నాయి. అన్ని బ్యాంక్‌లు పింఛన్ లబ్ధిదారులతో నిండిపోయాయి. ఖాతాదారులు ఎక్కువ సంఖ్యలో రావడంతో బ్యాంకుల్లో సర్వర్లు పనిచేయక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. బయటకు పోదామంటే ఎండ.. లోపల ఉండాలంటే ఉక్క.. ఏంచేయాలో తెలియక లబ్ధిదారులు అగచాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. చిల్లకూరు, తిక్కవరంలోని ఏపీజీబీ బ్యాంకులు, చింతవరంలోని ఎస్బీఐ, కెనరా బ్యాంకుల వద్ద ఇలా లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించడం కనిపించింది.



చిల్లకూరు: చింతవరంలోని ఓ బ్యాంక్‌లో కిటకిటలాడుతున్న పింఛన్ లబ్ధిదారులు

బాబు మట్టికొట్టుకు పోతాడు



25 కిలోమీటర్లు బస్సులో వచ్చాను. వెంకటగిరి నుంచి వచ్చే బస్సులో సీటు దొరకలేదు. ముచ్చేలి వరకు నిలబడి వచ్చి అక్కడి నుంచి కూర్చున్నాను. కాళ్లు పడిపోతున్నాయి. తర్వాత ఆటో ఎక్కి బ్యాంకు వద్దకు చేరుకున్నాను. ఆయాసం, ఎండ నీరసం కలిగింది. రూ.20 పెట్టి నీళ్ల సీసా కొనుక్కుని బ్యాంకులో ఉన్న లైన్‌లో కూర్చున్నాను. ఎపుడు ఇస్తారో తెలియదు. గతంలో వలంటీర్లు మా ఇంటికి వచ్చి తలుపుతట్టి 4గంటలకే పింఛన్ ఇచ్చేవారు. మందులు కొనుక్కునే దాన్ని. కొడుకులు, కోడళ్లు పెట్టకపోయినా జగన్ పుణ్యమా అని పింఛన్ సొమ్ముతో సంతోషంగా జీవించేదాన్ని. ఇప్పుడు చంద్రబాబు కారణంగా ఈ కష్టాలు పడాల్సి వస్తోంది. బాబూ..నువ్వు మట్టికొట్టుకుపోతావు. - కుప్పమ్మ, ఇలగనూరు, శ్రీకాళహస్తి మండలం

పింఛన్ కోసం ఆపసోపాలు



కనపర్తి గ్రామం నుంచి ఆటో ఎక్కి పాతబస్టాండు వద్ద దిగి అక్కడి నుంచి బ్యాంక్‌కు వెళ్లేందుకు ఆటోను అడిగితే రూ.20 ఇవ్వమన్నారు. కిలో మీటరు మేర నడుచుకుంటూ బ్యాంకు వద్దకు చేరుకున్నా. పింఛన్ ఎప్పుడు ఇస్తారో తెలియదు. క్యూ పెద్దదిగా ఉంది. నాలుగేళ్లు వలంటీర్లు తలుపుతట్టి మరీ పింఛన్ డబ్బులు చేతిలో పెట్టి వెళ్లారు. చంద్రబాబు దుష్టబుద్ధితో మాకు ఈ ప్రయాస మిగిల్చారు.
- రామమ్మ, కనపర్తి గ్రామం, తొట్టంబేడు

మాపై ఎందుకంత కక్ష



ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ దగ్గర హాయిగా పింఛన్ డబ్బులు తీసుకునే వాళ్లం. వలంటీరే వచ్చి మా పింఛన్ నగదును ఇచ్చే వారు. అవ్వా పింఛన్ డబ్బులు తీసుకో అంటూ పైసా కూడా తీసుకోకుండానే మా పింఛన్ రూ.3 వేలు ఇచ్చి వెళ్లేవారు. పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే ఎలాంటి బాధలు పడేవాళ్లం కాదు. ఎలక్షన్ రాగానే చంద్రబాబుకు కడుపుబ్బి పోయింది. వలంటీర్లు పింఛన్ ఇవ్వకూడదని అడ్డు తగిలారు. వలంటీర్లు ఎక్కడ తిరగకుండా చేశాడు. ఇప్పుడు పింఛన్ నగదు తీసుకోవాలంటే దేవుడు కనపడుతున్నాడు. బ్యాంకు వద్దకు వెళ్లిన తర్వాత రెండు గంటల పాటు క్యూలో ఉండి పింఛన్ నగదును తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. మా ఉసురు తప్పక తగులుతుంది.
- కే.సుబ్బమ్మ, గుండవోలు గ్రామం, రాపూరు మండలం

ఈ తిప్పలు మాకొద్దు



ఒకటో తేదీ వచ్చిందంటే తెల్లవారు జామునే ఇంటి తలుపు తట్టి పెన్షన్ సొమ్ము ఇచ్చే వలంటీర్లను తీసేశారు. ఇప్పుడు బ్యాంకు వద్దకు వెళ్లితే ఆ జనాన్ని చూస్తే భయమేస్తోంది. ఆ క్యూలో నిలుచుకునే ఓపిక కూడా లేదు. మాలాంటి నిరుపేదలను కష్టపెట్టేవారికి మా గోడు తప్పక తగలుతుంది బాబు. చంద్రబాబూ.. మాపై ఎందుకు ఇంత కోపం?. - ఎం.రమణమ్మ, రాపూరు

కాళ్లీడ్చుకుంటూ వచ్చా



గత రెండు నెలలుగా కాళ్లు, చేతులు నొప్పులతో బాధపడుతున్నా. మనిషి లేందే బయటకు రాలేను. గతంలో వలంటీరు పింఛన్ డబ్బులు ఇంటికి తెచ్చిచ్చేవాడు. నేను డబ్బులిచ్చి మాత్రలు కావాలన్నా తెచ్చిచ్చేవాడు. ఫోన్ చేసి ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించి వెళ్లేవాడు. ఇప్పుడు వాళ్లను తీసేసేకాడికి నా పరిస్థితి దారుణంగా మారింది. ఆటోకు రూ.100 పెట్టుకుని బ్యాంక్ వద్దకు వచ్చాను. మరో రూ.100 ఉంటే కానీ ఇంటికి వెళ్లలేను. బ్యాంకులో వారిని వీరిని అడుక్కుని మెట్లెక్కి లోపలకు వచ్చాను. వృద్ధాప్యంతో మేము ఈ బాధలు పడుతుంటే ఎన్నికల ముందు చంద్రబాబు మమ్మల్ని ఈ విధంగా కష్టాలపాలు చేశాడు. - తిరుమలమ్మ, తెట్టు, శ్రీకాళహస్తి

ఈ పాపం ఊరికే పోదు



వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అందించే పింఛన్ పంపిణీని అడుగడుగునా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టి వార్డు వలంటీర్లను అడ్డుకున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు పుట్టగతులు ఉండవు. ఎండల్లో వ్యయప్రయాసలకోర్చి పింఛన్ల కోసం పరుగులు పెట్టే పరిస్థితులను తెచ్చిన వారు ఈ పాపాలను అనుభవించక తప్పదు. బ్యాంకులో పింఛన్ పడి రెండు రోజులు అవుతున్నా ఇప్పటివరకు తెచ్చుకోలేకపోయాను. ఎండలు ఓ కారణం అయితే దూరంగా ఉన్న బ్యాంకుకు వెళ్లడానికి నాకు అవకాశం లేకుండా పోయింది. ఆటోలో వెళ్లి రావడానికి రూ.300 వరకు ఖర్చు పెట్టాలి. గడిచిన ఐదేళ్లు గౌరవంగా వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి ఆదరించేవారు. ఆ పరిస్థితులను అడ్డుకోవడం మంచి పద్ధతి కాదు.
- రమణమ్మ, తిరుపతి

ఆగమోక్తం..భాష్యకారుల ఉత్సవం



భాష్యకార్ల ఉత్సవ ప్రారంభంలో హారతి ఇస్తున్న అర్చకులు

తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరగనుంది. మే 12న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహించనున్నారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంతపరంగా మీమాంస గ్రంథానికి 'శ్రీభాష్యం' పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. శ్రీరామానుజులవారు జన్మించిన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భాష్యకారుల ఉత్సవాల మొదటి రోజు శుక్రవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం శ్రీ రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్ఠి చేపట్టారు. తిరుమల పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి పాల్గొన్నారు. - తిరుమల



మాడవీధుల్లో ఊరేగుతున్న భాష్యకారులు

పేదల ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పెళ్లకూరు: పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన సాగించిన జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి ప్రజలను అభ్యర్థించారు. శుక్రవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డితో కలిసి మండలంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సుపరిపాలనతో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా కిలివేటి సత్యనారాయణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి సంజీవయ్య, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి

నాయకులు ప్రద్యుమ్న కుమార్‌రెడ్డి, వెంకటరత్నం, చక్రపాణి, రఘునాయుడు, అమరేంద్రరెడ్డి, బాబురెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతదేహాల అప్పగింత

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ముగ్గురి మృతదేహాలను శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. ప్రమాదంలో మహారాష్ట్ర, ముంబయ్ ఒబెరాయ్ గార్డెన్ సిటీకి చెందిన లలిత్ కుమార్ సింఘాల్(57), భార్య అంజు సింఘాల్(52), చెన్నైకి చెందిన కారు డ్రైవర్ జయమురుగన్ (26) మృతిచెందారు. మృతదేహాలను పోస్టు మార్టం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ పోస్టు మార్టం అనంతరం లలిత్‌కుమార్‌సింఘాల్, అంజుసింఘా కుమారుడు చిరోగ్ సింఘాల్‌కు అప్పగించినట్లు సీఐ వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన తమిళనాడు బస్సు డ్రైవర్ శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో సీఆర్పీ



టీడీపీ ఎన్నికల ప్రచారంలో సురేష్‌బాబు (వృత్తంలోని వ్యక్తి)

ఏర్పేడు: టీడీపీ ఎన్నికల ప్రచారంలో సీఆర్పీ పాల్గొనడం చర్చనీయాంశమైంది. గురువారం రాత్రి శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ మండలంలోని చిందేపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏర్పేడు విద్యాశాఖలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తున్న ఎన్.సురేష్ బాబు ఆ ప్రచార బృందంతో పాటు ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పీజీ దూరవిద్య ఫలితాల విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీయూ దూరవిద్యాకేంద్రం ఆధ్వర్యంలో గత ఏడాది సెప్టెంబర్‌లో నిర్వహించిన పీజీ మ్యాథ్‌మాటిక్స్, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామ్లానాయక్ శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు ఫలితాల కోసం వర్సిటీ డీడీఈ అధికార వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

కూటమి నాయకులు..
అభివృద్ధి నిరోధకులు

- చిత్తూరులో దోచుకుంది చాల్లేదా?
- జనసేన అభ్యర్థికి ఓటుతో జనమే సమాధానం చెబుతారు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన ధ్వజం

తిరుపతి మంగళం: అడుగడుగునా తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవాలని చూసిన అభివృద్ధి నిరోధకులు కూటమి నాయకులని స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. నగరంలోని 14, 31 డివిజన్లలో శుక్రవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, బొమ్మగుంట రవి, దుద్దేల బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డులలో వారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతిలో చేస్తున్న అభివృద్ధికి నగర ప్రజలంతా అభినయ్ లాంటి విజన్ ఉన్న నాయకుడే తమకు ఎమ్మెల్యేగా కావాలని ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. కూటమి నేతలకు జెండాలు తప్ప అజెండాలు లేవన్నారు. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చిత్తూరును దోచుకుని స్థానిక ప్రజలకు ఏమీ చేయకపోవడంతో జగనన్న అతనికి టికెట్ ఇవ్వలేదన్నారు. చివరకు రూ.30 కోట్లు పవన్‌కళ్యాణ్‌కు లంచం ఇచ్చి టికెట్ తెచ్చుకున్నాడే తప్ప ప్రజలకు మేలు చేయాలనో, అభివృద్ధి చేసేందుకో కాదన్నారు. చిత్తూరులో దోచుకుంది చాలక తిరుపతిలో కూడా దోచుకోవాలనే దురాశతో ఇక్కడికి వచ్చిన అవినీతి పరుడు, ప్రజాద్రోహి ఆరణి శ్రీనివాసులు అన్నారు. ఆరణి శ్రీనివాసులు గెలిస్తే స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు రాజకీయ భవిష్యత్ కూడా ఉండదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, నాయకులు అనీల్‌రెడ్డి, కృష్ణమూర్తి, చిరంజీవి, తిమ్మారెడ్డి, మోహన్‌యాదవ్ పాల్గొన్నారు.




ఎన్నికల ప్రచారానికి పోటెత్తిన జనం (ఇన్‌సెట్) తిరుపతి 14వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్

కనికట్టు కథలొద్దు!

- పచ్చపత్రిక.. పచ్చి అబద్ధాలు
- జిల్లాలో 571 కొత్త కాలనీల ఏర్పాటు
- 72,436 మందికి జగనన్న ఇళ్లు
- అందులో 28,528 ఇండ్లు పూర్తి
- వివిధ దశల్లో 43,908 ఇండ్లు

తిరుపతి అర్బన్: నిరుపేదలకు నీడ కల్పించాలని, ప్రతి పేదోడికి సొంతింటి కల నెరవేర్చాలనే జగన్ సర్కారు పరితపించింది. అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికి ఇంటి స్థలం మంజూరు చేసింది. దాంతోపాటు ఇంటి నిర్మాణ బాధ్యతలనూ భుజాన వేసుకుంది. జిల్లాలో 571 కొత్త కాలనీలు ఏర్పాటు చేసింది. మొత్తం 72,436 మందికి ఇంటి పట్టాలు ఇవ్వగా.. అందులో ఇప్పటికే 28,528 ఇళ్లు పూర్తి చేసింది. మరో 43,908 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. అయితే దీన్ని జీర్ణించుకోలేని పచ్చపత్రిక కట్టుకథలు అల్లి తప్పుడు కథనాలు ప్రచురించింది. 99.5 శాతం మందికి మంచి చేసినా.. ఎక్కడో సాంకేతిక కారణాలతో 0.5 శాతం తప్పిదాలను గుర్తించి వారి ఫొటోలతో అబద్ధపు ప్రచారానికి ఒడిగట్టింది. 'ఇళ్లు కాదు.. అబద్ధాలు కళ్లకు కట్టారు' అంటూ తప్పుడు కథనాన్ని ప్రచురించింది. దీనిపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్ర ప్రభుత్వం పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా అందరికీ ఇళ్లు మంజూరు చేసిందని, ఇలాంటి తప్పుడు కథనాలు రాస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. శ్రీకాళహస్తి మండలం, ఊరందూరు గ్రామానికి చెందిన ఓ నేత కుటుంబంలోని వ్యక్తుల ఫొటోలను పెట్టి తమకు అన్యాయం చేసినట్లు పచ్చిపత్రికల్లో కథనాలు రాయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.



కొత్తగా నిర్మించిన తొండవాడ లే అవుట్

లారీ.. మినీ లారీ ఢీ

– గంటకు పైగా డ్రైవర్ నరక యాతన



లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్

చిల్లకూరు: లోడ్డుతో ఉన్న లారీ పత్రగుంట సమీపంలో నెమ్మదిగా వెళ్తోంది. ఈ క్రమంలో వెనుకనే అదేమార్గంలో వస్తున్న మినీ లారీ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా ఇరుక్కుపోయింది. అందులో డ్రైవర్ బయటకు వచ్చేందుకు సుమారు గంటకు పైగా నరక యాతన పడాల్సి వచ్చింది. ఈ సంఘటన చిల్లకూరు మండలం, బూదనం టోల్‌ప్లాజా సమీపంలోని పత్రగుంట వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు.. గూడూరు వైపు నుంచి చెన్నైకి క్వార్జ్ లోడ్డుతో వెళుతున్న లారీ పత్రగుంట సమీపంలో నెమ్మదిగా కదులుతోంది. అదేసమయంలో వెనుక నెల్లూరు నుంచి చెన్నైకి వెళుతున్న మినీ లారీ వేగంగా వచ్చి లారీని ఢీకొట్టింది. మినీ లారీ నుజ్జునుజ్జు కావడంతో రోడ్డుకు అడ్డంగా తిరిగిపోయింది. అందులోని డ్రైవర్ లారీలో ఇరుక్కుపోయాడు. మొబైల్ పోలీసులు, టోల్ ప్లాజా అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను గంటపాటు కష్టపడి అతికష్టంమీద బయటకు తీశారు. ఆ తర్వాత గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టీడీపీకి షాక్

- తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాలఉషా వైఎస్సార్‌సీపీలో చేరిక
- స్వాగతించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తిలో చక్రాలఉషా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల ఉష వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో ఆమె పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు ఆమె వైఎస్సార్ విగ్రహం నుంచి భారీ ర్యాలీగా పెండ్లి మండపం, భేరివారి మండపం, భిక్షాల గాలిగోపురం, బియ్యపు కృష్ణారెడ్డి మండపం మీదుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేశారు. ఆమెతోపాటు సుమారు 500 మంది మహిళలు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నీతిగా ఉండేవారిని ఆహ్వానిస్తాం

ఎమ్మెల్యే మాట్లాడుతూ నీతిగా, నిజాయితీగా ఏ పార్టీలో నుంచి వచ్చినా వైస్సార్‌సీపీలో స్థానం ఉంటుందన్నారు. టీడీపీలో అనేక సంవత్సరాలుగా మహిళా కార్యకర్త నుంచి పార్లమెటు అధ్యక్షురాలి వరకు చేరిన చక్రాల ఉష పార్టీ సిద్ధాంతాలు, అధిస్థాన నిర్ణయానికి కట్టుబడి పనిచేశారన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో లేకపోయినా పార్టీ కోసం ఆమె కృషి చేశారని చెప్పారు. అలాంటి వారు బొజ్జల సుధీర్‌రెడ్డి తీరు, అహంకారం నచ్చక ఆ పార్టీని వీడుతున్నారని తెలిపారు. చక్రాల ఉష వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం చక్రాల ఉష మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి తమ ఆత్మగౌరవం కించపరిచేటట్లు మాట్లాడారని, ఇలాంటి వారితో కలిసి ఉండడం సాధ్యం కాదని భావించి వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వెల్లడించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నాయకత్వంలో కష్టపడి పనిచేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సామాను శ్రీధర్‌రెడ్డి, అంజూరుతారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, కూనాటి రమణయ్యయాదవ్, సిరాజ్‌బాషా, జయగోపాల్, బుజ్జిట్టిరెడ్డి, నంద, పఠాన్ ఫరీద్, గోరా, రవి, అమాస్, పులి రామచంద్ర, శంకరయ్య, జనార్ధన్‌యాదవ్, వడ్ల తాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, సుబ్బరాయుడు, పీఎం చంద్ర, శీను, గఫూర్, రామచందారరెడ్డి, కంచి గురవయ్య, చందమామల కోటయ్య, కిరణ్, సుమతి, సాగీరాబీ, షర్మిళ ఠాగూర్, ప్రమీల, వనజమ్మ, పద్మజ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 30 కుటుంబాలు చేరిక

వెంకటగిరి రూరల్: బాలయపల్లి మండలం యాచవరం, కోటంబేడు గ్రామాలకు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు శేషారెడ్డి, రమేష్‌గౌడ్, వెంకటరమణారెడ్డి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

బెల్లంకొండ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిక

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ పుట్టయ్యతో పాటు బీసీ కాలనీకి చెందిన పలువురు టీడీపీ సానుభూతిపరులు ఎమ్మెల్యే సంజీవయ్య సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామానికి చెందిన పుట్టయ్య, కిలారి బాలకృష్ణతో పాటు పలువురు బీసీలు పార్టీలో చేరారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, నాయకులు వీరకుమార్, బాలసుబ్రమణ్యం, వీరయ్య, మణి, అశోక్, ఆనంద్ పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : చక్రాలఉషాకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



పెళ్లకూరు : పుట్టయ్యకు పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



వెంకటగిరి : పార్టీలో చేరిన యాచవరం కుటుంబాలతో రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి : పార్టీలో చేరిన కోటంబేడు గ్రామస్తులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వేధింపులు భరించలేక రాజీనామా



ఓజిలి: రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ఓజిలి: కపట కూటమి నేతల వేధింపులు భరించలేక ఓజిలి సచివాలయానికి చెందిన 15 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ శ్రీనివాసులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పుణ్యమా అని పేదలకు సేవ చేసే భాగ్యం దక్కిందన్నారు. ఇప్పుడు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నేతలు తమపై పగబట్టి వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. వారి వేధింపులు భరించలేకే తమ పదవులకు రాజీనామా చేసినట్టు వెల్లడించారు.

41 మంది రాజీనామా

కలువాయి: కలువాయి మండలంలో 41 మంది వలంటీర్ల రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ ప్రభాకర్‌కు అందజేశారు. ఇందులో తెలుగురాయపురం సచివాలయ పరిధిలో 13 మంది, తోపుగుంట సచివాలయ పరిధిలో 11 మంది, కుల్లూరు సచివాలయ పరిధిలో 9 మంది, కనుపూరుపల్లి సచివాలయ పరిధిలో ఆరుగురు, కలువాయి 2 సచివాలయ పరిధిలో ఇద్దరరు రాజీనామా చేశారు. మొత్తంగా మండలంలో ఇప్పటివరకు 125 మంది రాజీనామా చేసినట్టు వలంటీర్లు తెలిపారు.

వాడుకుని వదిలేయడం బొజ్జలకు అలవాటే!



పేరం నాగరాజునాయుడు

శ్రీకాళహస్తి: తొలి నుంచి పార్టీ ఉన్నతి కోసం తాను టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశానని, అయితే బొజ్జల కుటుంబం తనను వాడుకుని వదిలేసిందని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థి పేరం నాగరాజు నాయుడు ఆరోపించారు. శనివారం నుంచి ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఆయన శుక్రవారం శ్రీకాళహస్తిలో మాట్లాడుతూ తాను బొజ్జల సుధీర్ రెడ్డితో విభేదించి టీడీపీ నుంచి బయటకు వచ్చి ఎమ్మెల్యేగా పోటీ చేశానన్నారు. 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా పనిచేశానని, అయినా తనకు ఏ విధమైన గౌరవం దక్కలేదన్నారు. బొజ్జల సుధీర్‌రెడ్డి స్థానికుడు కాదని, అతను హైదరాబాద్ వాసని విమర్శించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 65,313 మంది స్వామివారిని దర్శించుకోగా 28,780 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.54 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.